ఆహ్లాదకరం.. ఆనందమయం

- చురుగ్గా మోడల్ పార్కు అభివృద్ధి పనులు
- రూ.1.10 కోట్లతో నిర్మాణాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తుని: ఆధునిక యుగంలో ప్రజలు యంత్రాల మాదిరిగా పనులు చేస్తూ అలసిపోతున్నారు. సాయంత్రం వేళ కొద్ది సేపు విశ్రాంతి, ఆహ్లాదం, వినోదం పొందడానికి అనువైన పార్కులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత పాలకులు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వలేదు. స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు పచ్చదనానికి ప్రాధాన్యం కల్పించాలని ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం కానరాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పురపాలకసంఘ పాలక వర్గం ప్రజల అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పట్టణంలోని ప్రధాన పార్కులను దశల వారీగా అభివృద్ధి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించారు. విశాల స్థలం ఉన్న గణపతినగర్ పార్కును రూ.1.10 కోట్లతో మోడల్ పార్కుగా నిర్మిస్తున్నారు.


గణపతినగర్ పార్కులో నిర్మిస్తున్న ఓపెన్ ఆడిటోరియం


వాకింగ్ ట్రాక్ కోసం సిద్ధం చేసిన టైల్స్

పార్కు అభివృద్ధికి నిధుల వివరాలు

ఎంపీ నిధులు	: రూ.20 లక్షలు
టీపీస్	: రూ.40 లక్షలు
16వ ఆర్థిక సంఘం	: రూ.35 లక్షలు
జనరల్ ఫండ్స్	: రూ.15 లక్షలు
మొత్తం	: 1.10 కోట్లు

పెద్దల నుంచి పిల్లల వరకు ఆస్వాదించే విధంగా నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం పనులు శర వేగంగా జరుగుతున్నాయి.

పార్కులో సదుపాయాలు

కార్పొరేషన్ స్థాయిలో పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పార్కుకు చుట్టూ ప్రహరీ నిర్మించారు. వాకింగ్ ట్రాక్, పిల్లలకు ప్లే జోన్, షటిల్ కోర్టు, ఓపెన్ జిమ్, ఓపెన్ ఆడిటోరియం, పచ్చదనం, లైటింగ్ తదితర సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఇంత వరకూ తునిలో ఎక్కడా ఇటువంటి సదుపాయాలు లేవు. సాయంత్ర వేళల్లో ప్రజలు సేద తీరేందుకు పచ్చిక మధ్యలో బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి పనులు పూర్తి అవుతాయని ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు.

ఎంపీ, మంత్రి సహకారంతో అభివృద్ధి



పట్టణ ప్రజల కోసం అందమైన పార్కును నిర్మిస్తున్నాం. వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ ఆస్వాదించే విధంగా నిర్మాణాలు అందుబాటులోకి రానున్నాయి. కాకినాడ ఎంపీ వంగా గీత, రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అందించిన సహకారంతో పార్కును అభివృద్ధి చేస్తున్నాం.

– ఏలూరి సుధారాణి, చైర్‌పర్సన్, తుని

క్లుప్తంగా

27న జాబ్‌మేళా

తుని రూరల్: వెలమకొత్తూరు శివారులో 16వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నోబుల్ ఐటీఐ ప్రాంగణంలో ఈ నెల 27న వికాస సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఐటీఐ కరస్పాండెంట్ జి.సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇసుజు మోటార్స్, హోండాయ్ మోబిస్, సియాన్ ఈ'-హెచ్‌డబ్ల్యూఏ సుమిత్, ఇండో ఎంఐఎం, ఇండస్ కాఫీ, డిక్సాన్ అండ్ శ్రీకాళహస్తి పైప్స్ లిమిటెడ్, కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వరకూ జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు సర్టిఫికెట్ల నకళ్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావలన్నారు. మరిన్ని వివరాలకు 92466 94266 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కిర్లంపూడిలో హిందూ సమ్మేళనం


కిర్లంపూడిలో శోభాయాత్ర చేస్తున్న దివ్యానంద సరస్వతీ స్వామి, భక్తులు

కిర్లంపూడి: స్థానిక ఏనుగువీధి రామాలయంలో శుక్రవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనానికి దివ్యానంద సరస్వతీ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హిందూ ధర్మం ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. అనంతరం భజనలు, కోలాటం, వివిధ ఆధ్యాత్మిక ప్రదర్శనలు, గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వరావు, యడాలి రాంబాబు, బి.పేర్రాజు, టి.వీ రవిష్ణు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం


సత్యహరిశ్చంద్ర వీధి నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కళాకారులు సత్యహరిశ్చంద్ర వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నందిసెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో హరిశ్చంద్రగా కోనిబోని బాజ్జి, వీరబాహుగా బలిజి వీర్రాజు, నక్షత్రకగా మొరుకుర్తి పెంటయ్య, పాలిగా ఆర్.సత్తిబాబు, పక్కుర్తి పుష్ప నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్, డ్రెస్సింగ్ చేశారు. తొలుత గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నాటక ప్రదర్శనను ప్రారంభించారు.

బాధితుడికి చేయూత


బాధితుడు సుబ్బారావుకు వీల్‌చైర్, సాయం అందించిన స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు

తొండంగి: మండలంలోని శృంగవృక్షం గ్రామానికి చెందిన బాధితుడు యెలిశెట్టి సుబ్బారావుకు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు చేయూతను అందించారు. ఇటీవల జరిగిన లారీ ప్రమాదంలో సుబ్బారావు కాళ్లు దెబ్బతిని నడవలేని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం సుబ్బారావుకు వీల్ చైర్, నిత్యావసరవస్తువులు, కొంత ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకుడు నేమాల శ్రీనివాసరావు (ఎస్ఎస్ఆర్), సభ్యులు పేజ్ రాజు, దుర్గా ప్రసాద్, ఓంకార్, శ్రీను, శ్రావణ్, నూకరాజు, శ్రీనివాసు, వీరబాబు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ ఏసుబాబు సూచించారు.

వైభవంగా సత్యజ్యోతి ఊరేగింపు

అన్నవరం: క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని రత్నగిరిపై శుక్రవారం సత్యజ్యోతి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం 9 గంటలకు సత్యరథం మీద సత్యదేవుడు, అమ్మవారిని ఉంచి గ్రామ శివార్లలోని సాక్షి గణపతి ఆలయానికి తీసుకువెళ్లారు. అక్కడ సత్యదేవుడు, అమ్మవార్లకు పండితులు పూజలు చేసి సత్యజ్యోతిని వెలిగించారు. ఊరేగింపుగా రత్నగిరికి తీసుకువచ్చి కళావేదిక మీద ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్తిక అమావాస్య వరకూ ఈ సత్యజ్యోతిని కళావేదిక మీదనే ఉంచి పూజలు చేస్తారు. అధిక సంఖ్యలో భక్తులు సత్యజ్యోతిని దర్శించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్, అసిస్టెంట్ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు, సత్యదీక్ష స్వాములు పాల్గొన్నారు.


రత్నగిరిపై సత్యజ్యోతికి స్వాగతం పలికిన ఈఓ రామచంద్రమోహన్

సామాజిక సాధికార బస్సు యాత్రకు ఏర్పాట్లు పూర్తి

తుని: పట్టణంలో శనివారం నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం తుని రాజా కళాశాల మైదానంలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో సామాజిక సాధికార బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు సామాజిక సాధికార బస్సు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌కు చేరుతుందన్నారు. పలువురు మంత్రులు, ఎంపీలు మధ్యాహ్నం 3 గంటలకు ప్రెస్ మీట్ నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు బస్సు యాత్ర ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరుతుందని, ఆర్టీసీ కాంప్లెక్స్, శ్రీనివాసా సెంటర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, జీఎన్‌టీ రోడ్డు మీదుగా బాప్టిస్టు చర్చి రోడ్డు నుంచి బహిరంగ సభ వేదికకు చేరుకుంటుందని చెప్పారు. బస్సు యాత్రకు స్వాగతం పలకడానికి భారీ మోటారు సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు. మహిళలు సైతం బైక్ ర్యాలీలో పాల్గొంటారని చెప్పారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం పండితులు చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ, బాలు, వ్రత పురోహితులు కూచుమంచి ప్రసాద్ హోమం నిర్వహించారు. చండీ హోమాన్ని యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. మొత్తం 20 మంది భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనక దుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

జగ్గంపేట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే...జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న మోటార్ సైకిలిస్ట్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. వెనుకాల వస్తున్న మరో మోటార్ సైకిల్ డివైడర్‌ను ఢీకొట్టి ముందు ఉన్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు గాయాలు కాగా వీరిని 108, హైవే అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదస్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది స్వామి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మోటార్ సైకిళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

సప్తాహ మహోత్సవాలు ప్రారంభం


ధర్మవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలోని రాజరాజేశ్వరి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ద్వితీయ సప్తాహ మహోత్సవాలను శుక్రవారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ప్రారంభించారు. వచ్చే నెల 1వ తేదీ వరకూ ఈ సప్తాహ మహోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు సానా నూకరాజు నాయుడు, దొడ్డిపట్ల సోమన్నదొర, చెక్కపల్లి సత్తిబాబు, జువ్వల చిన బాబు, మారిశెట్టి శివకుమార్, సానా తాతీలు, సిద్ధ పెద్దకాపు, దళే కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

ప్రత్తిపాడు: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలు ప్రత్తిపాడులో శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

అభివృద్ధి పనులకు ఆమోదం


కౌన్సిల్ సమావేశంలో అజెండా చదివి వినిపిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: నగర పంచాయతీ సర్వ సభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 2019-20 ఏడాదిలో మంజూరైన రూ.కోటి నిధులతో పలు వార్డుల్లో సీసీ డ్రైన్లు, సీసీరోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ కార్యాలయంలో ఏసీ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. పలువురు సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. మొత్తం సభ్యులు 20 మందికి గాను వైఎస్సార్ సీపీ తరఫున ఆరుగురు, టీడీపీ తరుపున ఇద్దరు సభ్యులు హాజరు కావడంతో సమావేశం గట్టెక్కింది. కార్యక్రమంలో టీపీఓ ఆనంద్‌కుమార్, ఏఈ అనూష లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో సారా బట్టీలపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. సారా తయారీకి సిద్ధం చేసిన 12 డ్రమ్ముల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారీ, అమ్మకాలు, కొనుగోలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాకినాడ ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్, ఇంటిలిజెన్స్ సీఐ గిరిధర్, రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన ఉద్యోగులు


ఎంఈఓ గౌరమ్మకు సమ్మె నోటీసు ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

గోకవరం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం ఎంఈఓ బి.గౌరమ్మకు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 20న సమ్మెకు దిగుతున్నామని, దీనిలో భాగంగా ముందస్తుగా సమ్మె నోటీసు ఇచ్చినట్టు మండల జేఏసీ నాయకులు తెలిపారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురి అరెస్ట్

కిర్లంపూడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై పి.ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని కృష్ణవరం జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని గురువారం ప్రత్తిపాడు కోర్టులో హాజరు పరిచారు. కోర్టు జడ్జి కాటం భాను ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారని చెప్పారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

తొండంగి: స్థానిక అంబేడ్కర్ యూత్ సభ్యులకు దివీస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో శుక్రవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. క్రీడాకారులకు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు వాలీబాల్ కిట్లను అందజేశారు. యువత క్రీడల్లో రాణించడం ద్వారా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, దివీస్ ప్రతినిధి వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపితకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, మహానివేదన, మహ హారతి వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకొంది. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకుడు రామస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న పండితులు

భవిత కేంద్రం తనిఖీ

కోటనందూరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లల(దివ్యాంగుల) అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిస్ట్రిక్ట్ ఐఈ కోఆర్డినేటర్, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక నాన్ భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. భవిత కేంద్రంలో నిర్వహించే రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ పిల్లల పెర్ఫార్మెన్స్, కంప్యూటర్ విద్యను పరిశీలించారు. కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు నారాయణరావు, నాగగోవిందు పాల్గొన్నారు.


కోటనందూరు భవితకేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు


తెప్పోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు


పంపా నది ఒడ్డున చిన్నారుల నృత్య ప్రదర్శనలు


పంపా తీరంలో ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ

చూసిన కనులకు వైభోగం


పల్లకీలో సత్యదేవుడు, అమ్మవారిని పూజా మండపానికి తీసుకువస్తున్న పండితులు

అన్నవరం: క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి పంపా నదిలో సత్యదేవుని తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. పూలతో సుందరంగా అలంకరించిన హంస వాహనంపై స్వామి, అమ్మవార్లు మూడుసార్లు పంపా నదిలో విహరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె. రామచంద్రమోహన్‌తో సహ వేలాది మంది భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా పంపా నది ఒడ్డున చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాత్రి 6.30 గంటలకు తెప్పోత్సవం ప్రారంభమై 7.30 గంటల వరకూ కొనసాగింది. తెప్పోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులతో పంపా నదీ తీరం సందడిగా మారింది.


తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కార్తిక వనసమారాధన

గండేపల్లి: తాళ్లూరు సాధు స్త్రీల మఠంలో శుక్రవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

హరినామమే జీవనసోపానం

తాళ్లూరు కోదండ రామాలయంలో ఏకాహ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు పలు భజన మండళ్ల సభ్యులు ఏకాహం నిర్వహించారు.

కిర్లంపూడి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని చిల్లంగి చింతల తోటలో వేంచేసిన కనక దుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.